


"ఐతే వదినా! దేనికైనా గురువుల ముఖతా ఉపదేశం పొందటమే మంచిదంటావా?" అంది పొడిపిండి పీటమీద వేసి వత్తుతూ రమణమ్మ.

"అవును వదినా—క్షణికమై అనిత్యమైన యీ సంసార వ్యామోహంలో చిక్కుకోకుండా తరుణోపాయం చూసుకోవాలి మనం. అందుకు తగిన గురువుల అనుగ్రహం సంపాదించుకోగలిగామా ధన్యులమే! నీకు కావాలంటే మా గురువుగారిని పిలిపిస్తానుండు. ఆవిడ ఎంత గొప్ప జ్ఞాని అనుకున్నావు! నాకు శాంభవి ఉపదేశం చేసింది వారేగా..."

"అలాగా వదినా! తప్పకుండా పిలిపించు వారిని. ఏమిటో ఎంతసేపూ యీ పాడు పొట్టకు తినటమే కాని ఒక ముక్తీ మోక్షం అన్న ధ్యాసే లేకుండా పోతోంది కదా" అని నిస్పృహతో నిట్టూర్చింది రమణమ్మ.

"పోనీ నీవే ఉపదేశం చేయరాదుటమ్మా వదినా—"

"అమ్మో! మా గురువాజ్ఞ లేదు దానికి."

కజ్జికాయలు చేతితో చుడుతూ మళ్ళీ అందుకుంది రమణమ్మ.

"నాకు తెలీక అడుగుతాను కానీ వదినా—యీ ముద్రలంటారే—వాటివల్ల ఉపయోగం ఏమిటంటావు?" అంది కాస్త సంకోచంతో, మరికాస్త జంకుతో.

"ఏం కావాలి? మనసుకు బ్రహ్మానందం—యీ ప్రాపంచిక దుఃఖాలు అంటకుండా సర్వజగత్తునూ, ముక్కోటి దేవతలనూ నీలో చూచుకోగలుగుతావు... చిన్ముద్ర ఉందే చూడు...యిదీ... అంతా అంగుష్ఠమాత్రం...విప్పితే ఏముందీ! ఏమీ లేదు—యీ మాయప్రపంచంలో అంతా మాయే."

"ఎవరమ్మా లోపల" అన్న కేక వీధిలోంచి వినిపించింది. దానితోపాటు తలుపు తట్టిన చప్పుడూ అయింది.

ఉన్నపాళంగా లేచి కంగారుపడుతూ తలుపు తీసింది రమణమ్మ.

"సావిత్రమ్మగారెవరమ్మా" అంటూ లోనికి వచ్చాడు పిలిచిన వ్యక్తి.

తన పేరడుగుతున్న టెలిఫోను బంట్రోతును చూడగానే అందరికి మల్లేనే సావిత్రమ్మకీ ప్రాణాలు ఆవిసిపోయాయి. అత్తగారు గడపలో కాలు పెట్టటమే అరిష్టదాయక మనుకునే వారిలో ఆవిడొకతె.

'ఏం నాయనా—నేనే. ఏంపనొచ్చిందీ?" అంది నాలుక పిడచకట్టుకు పోతోంటే

"టెలిగ్రామొచ్చింది మీకు."

అంటూ సంతకం చేయటానికి కాగితం కలం యిచ్చాడు టెలిగ్రాఫు మనిషి.

ఒణుకుతున్న చేతుల్తో వంకర టింకరగా సంతకం పెట్టింది.

ఎక్కణ్ణుంచి వచ్చిందో యీ ముదనష్టపు తంతి అనుకుంటూ కవరు అడ్డదిడ్డంగానే చింపింది.

తీరా చూస్తే అంతా యింగిలీషులో ఉంది నానమ్మకడుపు బంగారమాయెరి!

"అదేంరోగమో ఈ పోస్టువాళ్ళకు! స్వతంత్రం వచ్చినా యింగిలీషులోనే వెలగబెట్టాలా టెలిగ్రాములు కూడా...అసలే అదుర్దా బడి ఛస్తోంటే అదరా బాదరా చదువుకోకుండా యీ పీడాకార మేమిటి" అని విసుక్కుంది సావిత్రమ్మ.

ముచ్చెమటలు పోస్తోఉంటే గబగబా ఎదరింటి పంతులు దగ్గరకు వెళ్ళింది. రవణమ్మ తలుపు గొళ్ళెం పెట్టి వదినగారి వెనకాలే వెళ్ళింది.

ఎదరింటాయనది సొంతబడే అయినా అదేం చాదస్తమో హైస్కూలు మాదిరిగా పెద్దగంటా, హాజరుపట్టీలూ ఉపకరణాలూ అవీ యివీ ఆట్టహాసం అంతా బోలెడు—రికగ్నైజు అయిన స్కూలుకూడా అంత పరిపూర్ణంగా ఉండదు.

"పంతులూ యీ తంతి చదివిపెట్టు బాబూ" అంది అదుర్దాని అణచుకోనేందుకు వ్యర్థప్రయత్నం చేస్తూ సావిత్రమ్మ.

ఆయన మొదట అడ్రసూ అవీ దగ్గరగానే చదివాడు. అసలు విషయానికి వచ్చేసరికే ఆయన ధోరణి ఆగిపోయింది.

అదిచూసి సావిత్రమ్మ మరీ బెంబేలు పడి పోయింది.

"ఎక్కడనుంచి వచ్చింది పంతులూ—"

"రాజమండ్రి మీ తమ్ముడిగారి దగ్గర్నుంచి—

"ఏమనీ" అర్థోక్తిలో ఆగిపోయింది.

"మణి అంటే మన అమ్మాయికదూ..."

"ఆ మా చిలకతల్లే...ఏం జరిగిందీ మా మణెమ్మకు! వెళ్ళేటప్పుడు వంట్లో కాస్త నలతగా కూడా ఉంది. వద్దే నాలుగు రోజులాగవే అంటున్నా వినకుండా పాఠాలు పోతాయని వెళ్ళింది."

ఇప్పటిదాకా 'మణి' అన్న పదం తరువాత పదం ఏమీ అని అర్థంకాక కొట్టుకుంటున్న పంతులుకి అంతా వివరంగా తెలిసిపోయినట్లయింది.

"మరి ముందే చెప్పారు కాదేం—కంగారు పడకండి గానీ అమ్మాయికి అదేదో మెట్రిమోనియా అనే జబ్బుకాబోలు వచ్చిందట — మిమ్మల్ని అర్జంటుగా రమ్మన్నారు మూర్తిగారు..."

"ఓరి భగవంతుడా—నేనేం చేతునర్రోయ్— లోకంలో యిందరు పిల్లలుండగా—నా కొక్కగా నొక్క నలుసు—నా బిడ్డకే రావాలా యీ మాయదారి జబ్బు! నా ప్రాణాలన్నీ దానిమీదనే నిలుపుకున్నా నోరిగా—దాన్నొక యింటిదాన్ని చేద్దాంకదా అనుకుంటున్నాకూడా...ఒక్క కన్ను కన్నుగాదు ఒక్క బిడ్డ బిడ్డకాదు అని పువ్వుల్లో పెట్టి పెంచుకుంటున్నా—" అంటూ అక్కడే బెంచీమీద చతికిల బడిపోయింది శోకాకుల సంతప్త హృదయ సావిత్రమ్మ—

"ఊరుకో వదినా—మరేం భయం ఉండదు... నీకోసం కలవరిస్తుంటే మరిది తంతి యిచ్చివుంటాడు. అవునుగాని పంతులుగారూ—ఆదేం జబ్బండీ?" అనడిగింది రవణమ్మ.

పంతులు సాలోచనగా... "అదేమో కొత్త పేరేనమ్మా—యింత వరకూ ఎవరం వినలేదు... మలేరియాలాంటిదేగాని యింకా ప్రమాదకరమైం దనే నా ఉద్దేశ్యం...కాకపోయినా పిదపకాలం పిదప రోగాలూను! చిత్రంగా వస్తున్నాయి. వీటి కింకా మందులుకూడా కనిపెట్టినట్టు లేదు— అయినా ప్రమాదమే లేకపోతే టెలిగ్రామెందు కిస్తారు? వెళ్ళేటప్పుడే జబ్బుఅన్నారాయె. చాలా ఎక్కువయింది కామోసు! పాపం. ప్చ్—ఎంత మంచి పిల్లండీ! హు—నిజంగా మణిపూసలాంటిది! సెలవల్లో యింటికి వచ్చినా మళ్ళా సెలవలయి వెళ్ళిందాకా బైటికైనా వచ్చేదికాదు. అపిల్లకి రావాల్సిన జబ్బుకాదిది!" అన్నారు సానుభూతితో.

"చాల్లెండి—మీ సానుభూతితో గుండె మరింత బేజారు చేయకండి."

"పద వదినా—సమయానికి మీ అన్నగారూ కేంపుకు వెళ్ళారా...మూడు గంటలకు బండీ ఉందిగా. ఆలశ్యం చేయకుండా బయలుదేరు మరిది నీకోసం ఎదురు చూస్తూ ఉంటాడు..."అని లేవదీసి యింటికి తీసుకొచ్చింది రవణమ్మ.

ఈ గొడవంతా చూసి తన మామూలు కాఫీ డబ్బులమాట వదిలేసి జారుకున్నాడు టెలిగ్రాపు మనిషి.

పుట్టెడు దుఃఖంతో రైలెక్కిన సావిత్రమ్మ చేలికి సంచీ, టికెట్ యిస్తూ—

"...భద్రంగావెళ్ళు వదినా—వెళ్ళగానే మణి పరిస్థితి ఎలా ఉందీ కార్డు రాయించు. అవసరమైతే మీ అన్నగారు సర్కీటునుంచి రాగానే పంపుతాను ఆయన్నికూడా" అంది రమణమ్మ.

రైలు ఎంతకీ కదలనట్లు బయలుదేరినా పంతం పట్టి నత్తలాగా పాకుతున్నట్లే తోచింది సావిత్రమ్మకు. ఆ వేదాంతమంతా ఏమయిందోగాని... కోపపొడుగునా పాడు ఆలోచనలే-రామరామ అనుకుని లెంపలు వేసుకుంది. బిడ్డకు నయమవుతే వేంకటరమణమూర్తికి అయిదు కొబ్బరి కాయలు కొట్టి అయిదు శనివారాలుంటానని మొక్కుతుంది.

రిక్షాలోంచి దిగీదిగకముందే లోపలినుంచి ఏదయినా హడావుడి వినిపిస్తుందేమోనని భయపడుతూ బాధగా ఎదురు చూచింది. గడపలోపల అడుగుపెడుతూ 'రాధా? మణి ఏదీ...ఎలాఉంది!" అంది గాభరాగా.

ఆమె ప్రశ్న వినకుండానే "వచ్చారా వదినగారూ - సుబ్బులూ వారికి కాళ్ళకు నీళ్ళు తేవే... మీరు వస్తారని ఎదురు చూస్తున్నాం సాయంత్రం నుంచీ. పదండి కాళ్ళు కడుక్కోటానికి" అంది ప్రసన్నవదనంతో మరదలు రాధమ్మ.

"ఇదేమి యిలా నవ్వుతూ పేలుతూ ఉంది. తన కడుపు కాకపోబట్టి కాబోలు" అనుకుంటూ కాళ్ళమీద చెంబెడునీళ్ళు దిమ్మరించుకుని లోపలికి వచ్చింది సావిత్రమ్మ.

ఇంతలో పెరట్లోంచి "అమ్మా వచ్చావటే" అంటూనే చెంగనాలు వేసుకుంటూ వచ్చి మణి తల్లిని కౌగలించుకుంది. సావిత్రమ్మ తమ్ముడు కృష్ణమూర్తికూడా ఇప్పుడే వచ్చాడు. సావిత్రమ్మ గబగబా కూతుర్ని చేతుల్లో పొదువుకొని—

"నాతల్లేనీకు జబ్బని టెలిగ్రాం యిచ్చాడన్నాడేం పొయ్యేకాలమో వాడికి" అంది వదిలితే ఎక్కడ మాయమయిపోతుందో అని భయపడుతున్నట్లు. అందరూ యీ మాటవిని ఉప్పెనగా నవ్వుతూ ఉంటే అర్థంకాక తెల్లబోయి చూచింది నలుగురి వైపూ. "ఎవరు చదివారే జబ్బనీ-" అన్నాడు నవ్వాపుకుంటూ కృష్ణమూర్తి.

అదేమిటో మలేరియా లాంటిదేగాని యింకా ప్రమాదకరమైన కొత్తరకం రోగం అన్నాడురా మన ఎదరింటి పంతులు! నానా ఏడుపూ ఏడ్చుకుంటూ వచ్చాను" అంది అమాయకంగా సావిత్రమ్మ. "ఆఘోరించలేకపోయాడూ-బలేవాడే ఎవడోగాని...అమ్మాయికి పెళ్ళిసంబంధం వచ్చింది రేపు వాళ్లు చూట్టానికి వస్తున్నారు కాబట్టి రమ్మని నీకు వైరిచ్చాను—పొద్దున కాకినాడనుంచి మణెమ్మను 'తీసుకొచ్చాను ... అన్ని విషయాలూ నచ్చాయి పిల్లని వారూ వారిని మనం చూడటమే తరువాయి...ఇదుగో నీకూతురు నిక్షేపంలా ఉందిగా" అన్నాడు కృష్ణమూర్తి.

"నా బంగారు తల్లే—వాడి నోరుబడ ఎంత మాట చెప్పాడే నీ మీద! పోనీలేమ్మా - నీ మీది పీడంతా విరగడయిపోయిందిలే" అని సిగ్గుపడుతూన్న కూతుర్ని దగ్గరకు తీసుకుని తేలికైన హృదయంతో ఆశీర్వదిస్తూ ముద్దుపెట్టుకుంది సావిత్రమ్మ.

---

(34వ పేజీ తరువాయి)

వీళ్ళకి ఎదురుగా కూచున్న అందమైన ఒంటరి చిన్నదాని సంగతి పట్టనేలేదు.

ఇద్దరి వంకా చూస్తూ కూచుంది ఎంతసేపో ఆమె. వాళ్ళూ చూశారు గుట్లెట్టుకుని, కానీ మాట్లాడలేదు. రైలు స్పీడు తగ్గుతోంది. స్టేషను వస్తోంది. ఉండబట్టలేక పోయింది సరళ. ఛీ! ఏం మనుష్యులు!

"ఏవూరెడుతున్నారు?" అంది చిన్నావిడవంక చూసి సరళ. ఎంతో ఆత్రం ఆ ప్రశ్నలో!

"ఇక్కడే." అంటూ ఆవిడలేచి సంచీ చేత్తో పుచ్చుకుని లేచి, ఆవలించి చిటికె వేసింది. కుచ్చెళ్ళు సరిచేసుకుని తలుపు సమీపించారిద్దరూ. రైలు ఆగింది పెద్దస్టేషన్లో. ఇద్దరూ దిగి, ప్లాటుఫారందాటి మెట్లుయెక్కి బ్రిడ్జిమీద ఎక్కారు. సరళ కిటికీ దగ్గిరికొచ్చి నడిచిపోతున్న వాళ్ళిద్దరి వంకా చూసింది. అల్లా నడిచి జనంలో కలిసిపోయి, కనుపించకుండా పోయారిద్దరూ.

సరళ మనస్సు అదోలా వుంది. వాళ్ళను కేకేసి "ఏమండోయి! నేనింటరు చదువుతున్నాను. నాకు పదహారేళ్ళే!" అని అరవాలనిపించింది. సరళ గొంతులో ఏదో వేదనలాగా బయలుదేరి, మింగినా లోపలికిపోక, ఏడుపుగా పైకిరాక మిగిలిపోయింది. రైలు కదిలింది. ★